క్లుప్తంగా

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

మార్కాపురం: రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడిన మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీ మహిళా కూలీలు షేక్ మున్నీ, లక్ష్మీదేవి కుటుబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాగులుప్పలపాడు మండలంలో పొలంలో విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొని ఆరుగురు మహిళా కూలీలు మరణిస్తే ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారని గుర్తుచేశారు. క్షతగాత్రులకు 2 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం సీఐ సుబ్బారావు హెచ్చరించారు. పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆటో, ట్రాలీ ఆటో డ్రైవర్లకు సీఐ సుబ్బారావు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాల డ్రైవర్లు నిబంధనల మేరకు నడుచుకోవాలని హితవు పలికారు. పరిమితికి మించి కూలీలు, ప్రయాణికులను ఎక్కించుకుంటే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైద్యశాల సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

మార్కాపురం: మార్కాపురంలోని జీజీహెచ్ వైద్యశాల సిబ్బందిపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన జీజీహెచ్‌ను తనిఖీ చేశారు. స్టోర్ రూములో నిరుపయోగంగా ఉన్న వెంటిలేటర్లను చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐసీయూకు తాళం వేసి ఉండటాన్ని గమనించి ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. ఐసీయూను వెంటనే ప్రారంభించాలన్నారు. చిల్డ్రన్ వార్డు, డయాలసిస్ కేంద్రాలను పరిశీలించారు.

సమస్యలు చుక్.. చుక్!

- మార్కాపురం, గిద్దలూరు, కంభం రైల్వేస్టేషన్లలో సమస్యల కూత
- మౌలిక వసతుల లేమితో అభివృద్ధికి ఆమడ దూరం
- అమృత్ భారత్ కింద రూ.21.50 కోట్ల పనులు మంజూరు
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు
- రోజూ సుమారు 4 వేల మంది ప్రయాణికుల రాకపోకలు



మార్కాపురం రోడ్ రైల్వేస్టేషన్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో ముఖ్య రైల్వేస్టేషన్ మార్కాపురం రోడ్.. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతోపాటు దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల వారు ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి వెళ్లాలంటే ఇక్కడ దిగాల్సిందే. మార్కాపూర్ రోడ్ స్టేషన్ మీదుగా రోజూ సుమారు 20 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా హుబ్లీ, తిరుపతి, ప్రశాంతి, అమరావతి, ధర్మవరం, వాస్కోడిగామా, డోన్, కాచిగూడ, అనంతపురం, నర్సాపూర్, గుంటూరు, విజయవాడ, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు మార్కాపురం మీదుగా వెళ్తుంటాయి. రోజూ మార్కాపురం రైల్వేస్టేషన్ నుంచి సుమారు 4 వేల మంది ప్యాసింజర్లు సగటున రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే కంభం రైల్వేస్టేషన్ ద్వారా 2 వేల మంది, గిద్దలూరు రైల్వేస్టేషన్ ద్వారా సుమారు 3 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. అయితే రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతుల లేమి ప్రయాణికులను నిత్యం వేధిస్తోంది. గతేడాది కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ కింద మార్కాపురం రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు 21.50 కోట్ల రూపాయలు కేటాయించింది. కంభం రైల్వేస్టేషన్‌కు రూ.11.72 కోట్లు, గిద్దలూరు రైల్వేస్టేషన్‌కు రూ.11.72 కోట్లు కేటాయించారు. గతేడాది ఫిబ్రవరి 24న వర్చువల్ విధానంలో ఈ పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మొదట్లో పనులు వేగంగా సాగినా క్రమంగా నత్తతో పోటీపడుతున్నాయి.



పనిచేయని తాగునీటి కుళాయిలు

చేపట్టాల్సిన పనులివే..

అమృత్ పథకం కింద రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల వెయిటింగ్ హాలు, ప్లాట్‌ఫారం విస్తరణ, డిజిటల్ బోర్డులు, దివ్యాంగులకు ఇబ్బందిలేకుండా లిఫ్టుల ఏర్పాటు, తాగునీరు, స్నానాల గదులు, టాయిలెట్స్, 3వ ప్లాట్‌ఫారం షెడ్ల నిర్మాణం, ఎలక్ట్రికల్ తదితర పనులను చేపట్టాలి. అయితే పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఆదాయం బాగున్నప్పటికీ గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు అభివృద్ధి పనులపై శీతకన్ను వేశారు. అమృత్ పథకంలో నిధులు వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో ఖర్చుపెట్టలేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 2014–19 మధ్య వైవీ సుబ్బారెడ్డి ఒంగోలు ఎంపీగా ఉన్నప్పుడు రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక నిధులు కేటాయించడంతో అప్పట్లో అభివృద్ధి పనులు చేపట్టారు.

సమస్యలకు పరిష్కారం దొరికేనా?

- మార్కాపురం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. లీటర్ రూ.25 వెచ్చించి తప్పనిసరి పరిస్థితుల్లో మినరల్ వాటర్ బాటిల్స్ కొనుగోలు చేసి తాగాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- స్టేషన్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లను కడిగేందుకు కూడా నీటి సౌకర్యం లేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.
- ఫుడ్ వెండర్లు నాణ్యమైన ఆహారం విక్రయించకపోతుండటంతో వివిధ ఆన్‌లైన్ ఏజెన్సీల ద్వారా బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి. ప్రైవేట్ వెండర్ల ఆధిపత్యం ఎక్కువగా ఉంది.
- డిజిటల్ కోచ్ ఇండికేషన్ బోర్డులు లేకపోవడంతో ఎక్కడ బోగీ ఆగుతుందో తెలియక ప్రయాణికులు రైలు వచ్చే సమయంలో ప్లాట్‌ఫాంపై పరుగులు తీయాల్సి వస్తోంది.
- టూ వీలర్స్ పార్శిల్ బుక్ చేసినప్పుడు అధికమొత్తంలో వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

త్వరగా పూర్తిచేస్తాం

అమృత్ భారత్ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టరును ఆదేశించాం. స్టేషన్‌లో కొన్ని పనులు పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గుంటూరు రైల్వేడివిజన్

అధికారుల దృష్టికి తీసుకెళ్లా..



పశ్చిమ ప్రకాశంలో రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గుంటూరు రైల్వే డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లా, ప్రధానంగా డార్మెటరీ రూమ్, వెయిటింగ్ హాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం, లిఫ్టు సౌకర్యం పనులను త్వరగా పూర్తిచేయాలని కోరుతూ వినతిపత్రం కూడా అందజేశా.

– ఆర్‌కేజే నరసింహం, డీఆర్‌యూసీసీ మెంబర్, గుంటూరు రైల్వే డివిజన్

సమస్యలు పరిష్కరించాలి



మార్కాపురం రైల్వేస్టేషన్‌లో సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలి. ప్రధానంగా శ్రీశైలం వెళ్లే యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. వెయిటింగ్ హాలు త్వరగా పూర్తిచేయాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి. టాయిలెట్లను అందుబాటులోకి తేవాలి.

– ఎస్.నరసింహాచార్యులు, ప్రయాణికుల సంఘ నాయకుడు

బాలోత్సవ్‌లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు(బేస్తవారిపేట): ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవ్‌లో గిద్దలూరు విశ్వభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 12 విభాగాల్లో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనపరిచారు. రైతే రాజు ప్రదర్శనకు మొదటి బహుమతి, కథారచనలో ప్రశాంత్ మొదటి బహుమతి, విచిత్ర వేషధారణలో గంటా హన్విత ద్వితీయ, సైన్స్ ప్రాజెక్ట్‌లో ద్వితీయ, కోలాటంలో ప్రథమ, స్పెల్‌బీలో నసీఫా అత్తిక ద్వితీయ, మ్యాప్ పాయింటింగ్‌లో గురు చరిత ద్వితీయ, ఉర్దూ వ్యాసరచనలో ప్రథమ, ఉర్దూ డిబేట్‌లో ఎస్‌కే ఆఫ్రిన్, పట్టణ వ్యవసాయం-నూతన ఆవిష్కరణలో శివానంద ప్రథమ, కథారచన విభాగంలో జాస్మిన్ ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఎస్పీ దామోదర్ చేతులమీదుగా ప్రశంసపత్రాలు అందుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎస్పీ దామోదర్ చేతులమీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

బేస్తవారిపేట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తల బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, కేంద్రాల అద్దె, టీఏ బిల్లులు చెల్లించాలని కోరుతూ సీడీపీఓ నీలోఫర్ బేగమ్‌కు వినతిపత్రం అందజేశారు.



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

పశువుల దొడ్ల ఆక్రమణపై ఫిర్యాదు

- నిందితులపై చర్యలు తీసుకోవాలి
- సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు రైతుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బ్రహ్మయ్య

మార్కాపురం టౌన్: తమ పశువుల దొడ్ల స్థలాలను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌కు పలువురు రైతులు వినతిపత్రం అందించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారవీడు మండలంలోని శివాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు 80 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న 87 సెంట్ల భూమిని కొందరు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని, ఇదేమని అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. సొంత మండలాల్లో పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని యర్రగొండపాలెం మండలానికి చెందిన మూడమంచు పెద్ద బ్రహ్మయ్య వినతిపత్రం ఇచ్చారు. యర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఒక రెవెన్యూ అధికారి రూ.లక్షల్లో ముట్టజెప్పి ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా పోస్టింగు వేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ అధికారిది సొంత మండలం కావడంతో గతంలో ఆర్‌ఐగా పనిచేసిన సమయంలో భూముల అవకతవలకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా వేణుగోపాలుని గరుడోత్సవం

తర్లుపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం స్వామి వారికి గరుడోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈఓ చెన్నకేశవరెడ్డి, అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో..

తర్లుపాడులోని గంగా పార్వతీ సమేత శ్రీ నీలకంఠేశ్వరి ఆలయ గర్భగుడికి నూతన రాతి ముఖద్వారాల నిర్మాణం ధర్మకర్త నేరెళ్ల కార్తీక్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందించారు.



గరుడ వాహనంపై వేణుగోపాల స్వామివారు



నీలకంఠేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్డు ప్రమాద మృతులకు మాజీ ఎమ్మెల్యే ఘన నివాళి

మార్కాపురం: మార్కాపురం మండలం నికరంపల్లి–కుంట మధ్యలో ఆదివారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరబోలు లక్ష్మీదేవి, షేక్ మున్నీ మృతదేహాలకు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు సోమవారం రాత్రి నివాళులర్పించారు. మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో నివాసముంటూ ఆదివారం పొలం పనులకు వెళ్లి ఆటోలో తిరిగివస్తుండగా టైరు పేలడంతో ఇద్దరు మృతి చెందగా పది మంది గాయపడిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి నివాసాలకు చేర్చారు. మృతుల కుటుంబ సభ్యులను అన్నా రాంబాబు ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట షేక్ కరీముల్లా, రఫీ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

మార్కాపురం: మార్కాపురం మున్సిపాలిటీలోని 11వ వార్డు కౌన్సిలర్ దేవకరుణమ్మ భర్త ఎం.వరప్రసాద్ ఇటీవల సర్జరీ చేయించుకోగా సోమవారం రాత్రి మున్సిపల్ శాఖ మాజీమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు పరామర్శించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్‌తో మాట్లాడారు. వీరి వెంట మార్కెట్‌యర్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సురేష్, బూదాల సతీష్ తదితరులు ఉన్నారు.



వరప్రసాద్‌తో మాట్లాడుతున్న సురేష్, జంకె

కూటమి ప్రభుత్వంలో వైద్యసేవలు కరువు



జీజీహెచ్ వద్ద మాట్లాడుతున్న రజాక్

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో వైద్యసేవలు ప్రజలకు దూరమవుతున్నాయని ఎంపీజే అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఎంపీజే బృందంతో కలిసి జీజీహెచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జీజీహెచ్‌లో 80 మంది డాక్టర్లు ఉన్నారని, రోజుకు 700 వరకు ఓపీ వచ్చేదని అని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రస్తుతం 19 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారని, ఓపీల సంఖ్య సగానికి పైగా పడిపోయిందన్నారు. ఐసీయూ కూడా లేదని, గతంలో ఉన్న సదుపాయాలు కనుమరుగయ్యాయన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం కూడా నిలిచిపోయిందన్నారు. వైద్యసేవలను పునరుద్ధరించడంతోపాటు మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రారంభించకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీజే నాయకులు నాగూర్ మీరావలి, అబ్దుల్ రసూల్, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆటో..బైకు ఢీ

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని పోలవరం సమీపం బాబుమీయా డెయిరీ వద్ద ఆటో.. ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. అద్దంకి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అద్దంకి నుంచి ముండ్లమూరు వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో సింగన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం అద్దంకి తరలించారు. అక్కడి నుంచి ఒంగోలు తీసుకెళ్లినట్లు సమాచారం.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం



శివ పార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

- కళ్యాణ మహోత్సవానికి భారీగా హాజరైన భక్తులు
- కళ్యాణంతో పాటు విళక్కి కార్యక్రమం నిర్వహణ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కళ్యాణంతో పాటు శివస్వాముల విళక్కి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు రామప్రసాదశర్మ ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ మహోత్సవానికి పట్టణానికి చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరై కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రణవ పంచాక్షరీ, ఓం నమశ్శివాయ ఏకాహం, సుప్రభాతసేవ, గణపతి పూజ, పుణ్యావచనం, మండపార్చన కార్యక్రమాల నడుమ కళ్యాణం నిర్వహించారు. కళ్యాణంలో పట్టణానికి చెందిన పుణ్య దంపతులు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు రాంప్రసాదశర్మ మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలుగా, అష్టదశ శక్తి పీఠాల్లో ఒక్కటైన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వెలిసిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న మండల కేంద్రంలోని ఆలయంలో లోక కళ్యాణార్థం శివపార్వతుల కళ్యాణం, లక్షాదీపోత్సవం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

అలరించిన శివదీక్ష పడిపూజ

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన శివదీక్ష పడిపూజ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షించింది. కార్యక్రమాన్ని శివస్వాములు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని శివస్వాములు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. మండపంలో శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి వార్ల విగ్రహాలను అలంకరించి స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో నిర్వహించిన భజనతో పరిసర ప్రాంతం మార్మోగింది.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ నేతల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి నారాయణ

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పశ్చిమ ప్రకాశంలో కరువు పరిస్థితులు పోవాలంటే వెలుగొండ జలాలే శాశ్వతమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో 2 వేల కోట్లు కేటాయించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో చేసి చూపాలన్నారు. ముంపు గ్రామాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫ్లోరైడ్ నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ.. పాలకవర్గ విధానాలతో రైతులు కూలీలుగా మారుతున్నారన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య, పార్టీ నాయకులు చెన్నయ్య, ఖాశీం, రామయ్య, డాకా పుల్లయ్య, చిత్తారి పెద్దన్న, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వర స్వామి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని 108 రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకమైన పూలతో అలంకరించి ఆలయ అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది వాసు, శ్రీధర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.